


ఆర్‌ఎన్‌ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 43 తిరుపతి తేది : బుధవారం 13 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

## 15 నుంచి ప్రధాని మోదీ
## విదేశీ పర్యటనలు

న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 12



అంతర్జాతీయ వేదికపై భారత దౌత్య పటిమను చాటేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరు రోజుల పాటు ఐదు కీలక దేశాల్లో పర్యటించనున్నారు. మే 15వ తేదీన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో ప్రారంభమయ్యే ఈ పర్యటన నెదర్లాండ్స్, స్వీడన్, నార్వేల మీదుగా సాగి మే 20వ తేదీన ఇటలీతో ముగియనుంది. మరి ఈ ఐదు దేశాల పర్యటనలో భాగంగా మోదీ ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతున్నారు, మే 15వ తేదీన ప్రధాని మోదీ తొలుత యూఏఈ అధ్యక్షుడిని కలుస్తారు. ఇంధన సహకారం, వాణిజ్యం, 4.5 మిలియన్ల భారతీయ సమాజ సంక్షేమంపై చర్చించనున్నారు.

- మిగతా 2లో..

# నీట్ 2026 పరీక్ష రద్దు ..!

- రాజస్తాన్‌లో ప్రశ్నాపత్రం లీక్
- కేసు నమోదు చేసిన సీబీఐ
- మహారాష్ట్రలో ఒకరి అరెస్ట్
- ఈనెల 3న దేశవ్యాప్తంగా జరిగిన పరీక్ష
- 22 లక్షల మంది విద్యార్థులకు నిరాశ
- నిరుత్సాహంలో తల్లిదండ్రులు
- మోడీ సర్కార్ వైఫల్యాలకు నిదర్శనం
- మళ్లీ పరీక్ష నిర్వహిస్తాం.. : ఎన్‌టీఏ డీజీ అభిషేక్‌సింగ్

న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 12

మెడికల్ సీటు సాధించాలనే లక్షలాది మంది విద్యార్థు-ల కష్టం వృధా అయిపోయింది. డబుల్ ఇంజన్ సర్కార్ నిర్లక్ష్యంతో వారి భవిష్యత్తు అగమ్యగోచరమైపోయింది. వైద్య విద్యకు సంబంధించిన మే 3న జరిగిన జాతీయ అర్హతా పరీక్ష ( నీట్-యూజీ 2026)ను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ( ఎన్ టి ఎ) మంగళవారం ప్రకటించింది. ప్రశ్నా పత్రం లీకేజీ, అక్రమాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పరీక్షను ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని తెలిపింది. దీంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెలువెత్తాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. ?అసలు ఏం జరిగింది? మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా ( నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) నీట్ యుజి -- 2026 పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 552 నగరాలు, 14 అంతర్జాతీయ కేంద్రాల్లో కలిపి సుమారు 22 లక్షల మందికి పైగా




విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఆ సమయంలో జిపిఎస్ ట్రాకింగ్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, ఎఐ నిఘా, 5జి జామ్మర్లు వంటి భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎన్ టిఎ ఆర్భాటంగా ప్రకటించింది.. ?అయితే , పరిక్ష అనంతరం సోషల్ మీడియాలో రాజస్థాన్‌లో పరీక్షకు ముందే చలామణి అయిన గెస్ పేపర్ అసలు పరీక్షా పత్రంతో అచ్చుగుద్దినట్లు సరిపోలింది. ఈ విషయాన్ని విద్యార్థులు, కోచింగ్ సెంటర్లు గుర్తిం చాయి. దీనిపై ఒక్కసారిగా విద్యార్థులు

- మిగతా 2లో..



## రాజధాని అమరావతి నిర్మాణ
## పనులు వేగవంతం

- వారం రోజుల్లో అమరావతిలోని ఎమ్మెల్యేల భవనాలను జీఏడీకి అప్పగిస్తాం
- 20 రోజుల్లో ఎమ్మెల్సీల భవనాలను జీఏడీకి అప్పగిస్తామన్న నారాయణ
- అధికారులు, మంత్రుల భవనాలు కూడా తుది దశకు చేరుకున్నాయని వెల్లడి
- ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని 2027 ఆగస్ట్ నాటికి పూర్తి చేయడమే లక్ష్యమన్న మంత్రి

గుంటూరు - ఆంధ్రనాడు, మే 12

రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాల నిర్మాణాలు చివరి దశకు

- మిగతా 2లో..

## అస్సాం ముఖ్యమంత్రిగా రెండోసారి
# హిమంత బిశ్వ శర్మ ప్రమాణస్వీకారం

- హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా, కేంద్ర మంత్రులు
- శర్మతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం
- వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ-ఎన్డీయే కూటమి
- కూటమి పాలిత రాష్ట్రాల సీఎంలతో చంద్రబాబు, లోకేష్ సంభాషణ



అస్సాం - ఆంధ్రనాడు, మే 12

అస్సాంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి వరుసగా మూడో సారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గువాహటిలోని ఖానాపారాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య.. హిమంత బిశ్వ శర్మ చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. అస్సాం సంప్రదాయ



వస్త్రధారణలో ఉన్న శర్మ, ప్రమాణం చేస్తున్న సమయంలో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

- మిగతా 2లో..

# వైద్యఆరోగ్యశాఖ ప్రక్షాళన...

## - 51 మంది డిస్మిస్, 33 మందికి మెమోలు

విజయవాడ -ఆంధ్రనాడు, మే 12

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ మంత్రి సత్యకుమార్ యాదవ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన వైద్య పరికరాల కొనుగోళ్లలో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో, వీటిపై సమగ్ర విచారణకు ఆయన ఆదేశించారు. ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న శాఖలో అక్రమాలకు తావు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వైద్య పరికరాల సేకరణలో ఇకపై ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండకూడదని మంత్రి హెచ్చరించారు. కొనుగోళ్ల ప్రక్రియలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టెండర్ల దగ్గర నుండి డెలివరీ వరకు ప్రతి దశలోనూ పారదర్శకత ఉండాలని, దీని కోసం అత్యాధునిక విధానాలను అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిధులు



దుర్వినియోగం కాకుండా చూడడమే లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది పడుతున్న ఇబ్బందులపై మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపారు. వైద్య సిబ్బందికి

- మిగతా 2లో..



## అగ్నిమాపక శాఖలో దశల వారీ
# 1,275 పోస్టుల భర్తీ

### - మంత్రి అనిత

అమరావతి -ఆంధ్రనాడు, మే 12

అగ్నిమాపక శాఖలో ఉన్న సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన 1,275 పోస్టులను దశలవారీగా భర్తీ చేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జాబ్ క్యాలెండర్‌లో పేర్కొన్న 305 పోస్టుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర అగ్నిమాపక శాఖ పనితీరుపై హోంమంత్రి వంగలపూడి అనిత

- మిగతా 2లో..

## 15 నుంచి ప్రధాని మోదీ

# విదేశీ పర్యటనలు

(మొదటిపేజీ తరువాయి)

భారత్‌కు 3వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న యూఏఈతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యం.అక్కడి నుంచి మే 15వ తేదీన నెదర్లాండ్స్ వెళ్తారు. 17వ తేదీ వరకు అక్కడే పర్యటిస్తారు. రక్షణ, గ్రీన్ హైడ్రోజన్, సెమీ కండక్టర్లు, 'నీటి నిర్వహణ'పై వ్యూహాత్మక ఒప్పందాలను సమీక్షించనున్నారు. నెదర్లాండ్స్ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. మే 17వ తేదీ రోజు స్వీడన్ వెళ్తారు. 18 తేదీల్లో స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో ప్రధాని పర్యటిస్తారు. గ్రీన్ ట్రాన్సిషన్, ఏఐ, అంతరిక్షం, రక్షణ రంగాల్లో పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు సాగతాయియి. అలాగే ఐరోపా పారిశ్రామిక వేత్తల రౌండ్ టేబుల్ సమావేశంలో ఈయూ కమిషన్ ప్రెసిడెంట్‌తో కలిసి ఆయన ప్రసంగించనున్నారు.

**43 ఏళ్ల తర్వాత నార్వే పర్యటన..!**

ఈ పర్యటనలో అత్యంత విశేషంగా నార్వే పర్యటన నిలవబోతోంది. 43 ఏళ్ల తర్వాత భారత ప్రధాని నార్వే వెళ్లడం ఇదే తొలిసారి. మే 18వ తేదీన ఆయన నార్వేకు చేరుకుని 19వ తేదీన నార్వే రాజుతో పాటు ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అదే సమయంలో ఓస్లోలో జరిగే '3వ భారత్–నార్డిక్ సమ్మిట్'లో మోదీ పాల్గొంటారు. డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్లాండ్ ప్రధానులు కూడా ఈ సదస్సుకు రానున్నారు.పర్యటన చివరి రోజైన మే 20వ తేదీన ప్రధాని మోదీ ఇటలీ చేరుకుంటారు. ప్రధాని జార్జియా మెలోనితో కలిసి 'జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 2025–2029' అమలుపై సమీక్ష నిర్వహిస్తారు. రక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఇటలీతో భారత్ సంబంధాలను ఈ పర్యటన మరింత పటిష్టం చేయనుంది. మొత్తానికి ఐరోపా దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నేప థ్యంలో.. ఈ పర్యటన భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరిపోస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## రాజధాని అమరావతి నిర్మాణ

# పనులు వేగవంతం

(మొదటిపేజీ తరువాయి)

చేరాయని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. మంగళవారం రాజధాని అమరావతి లోని రాయపూడి వద్ద నిర్మిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాలను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .... అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల గురించి పక్క రాష్ట్రాల్లో ఆసక్తిగా మాట్లాడుకుంటున్నారని అన్నారు. 30,753 మంది రైతులు 35,017 ఎకరాలు రాజధాని కి భూములు ఇచ్చారని, 34,525 ఎకరాలకు ప్లాట్లు ఇచ్చామని తెలిపారు. 674 మంది రైతులకు మాత్రమే ప్లాట్లు ఇవ్వాల్చి ఉందన్నారు. కొంతమంది రైతులు కోర్టులకు వెళ్లడం, కుటుంబ వివాదాల కారణంగా ప్లాట్లు కేటాయింపు జరగలేదని, కావాలని కొంతమంది అమరావతి పై రాజకీయ కుట్ర చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. 98.06 రైతులకు ప్లాట్లు కేటాయించామన్నారు. భూములిచ్చినా ప్రభుత్వం ప్లాట్లు ఇవ్వలేదని ప్రచారం చేసే వాళ్ళు నిజాలు తెలుసుకోవాలన్నారు. లాటారి ద్వారానే ప్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. పూర్తయిన భవనాలను సాధారణ పరిపాలనా శాఖ (జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్ మెంట్) కు అప్పజెపుతామని మంత్రి నారాయణ వివరించారు.

## అగ్నిమాపక శాఖలో దశల వారీ

# 1,275 పోస్టుల భర్తీ

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫైర్ స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించిన మంత్రి, కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రత్యేకంగా విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో పరిశ్రమల భాగస్వామ్యంతో ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పరిశ్రమల సహకారంతో అగ్నిమాపక అవుట్‌పోస్టులు ఏర్పాటు చేయడం, ఫైర్ టెండర్ల వినియోగంపై ఆడిట్ నిర్వహించడం, పారిశ్రామిక వాడల్లో సమిష్టి అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు అంశాలను పరిశీలించాలని సూచించారు. పరిశ్రమల్లో ఫైర్ సేఫ్టీ అధికారుల నియామకం తప్పనిసరి చేయడంతో పాటు, వారి పనితీరుపై ర్యాండమ్ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. లైసెన్స్ పొడిగింపులకు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సింగపూర్, స్విట్జర్లాండ్ దేశాల్లో విపత్తు నిర్వహణ విధానాలను అధ్యయనం చేసి, రాష్ట్రంలో అమలు చేయగల అంశాలపై నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

# నీట్ 2026 పరీక్ష రద్దు ..!

(మొదటిపేజీ తరువాయి)

ఫిర్యాదులు చేయడం ప్రారంభించారు. ఈ ఫిర్యాదులు తీవ్రమవ్వడంతో మే 7న ఎన్ టిఏ స్పందించింది. రాజస్థాన్, ఉత్తరాఖండ్ నుంచి అందిన సమాచారం ఆధారంగా మే 8న ఈ కేసును స్వతంత్ర విచారణ కోసం కేంద్ర ఏజెన్సీలకు అప్పగించింది. మే 10న రాజస్థాన్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ ననగ్రూప్ (ఎస్ఓజి) ఈ అక్రమాలపై బహిరంగంగా విచారణ ప్రారంభించడంతో పరిస్థితి మరింత ముదిరింది. పరీక్షకు ముందు సుమారు 400 ప్రశ్నలు సర్క్యులేట్ అయ్యాయని, అందులో బయాలజీ, కెమిస్ట్రీకి చెందిన 100కి పైగా ప్రశ్నలు అసలు పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలుతున్నాయని ఎడిజిపి విశాల్ బన్సాల్ వెల్లడించారు. మే 11 నాటికి ఈ వివాదం పతాక స్థాయికి చేరింది. అసలు పేపర్‌లోని 180 ప్రశ్నలకు గానూ.. ఏకంగా 135 ప్రశ్నలు (90 బయాలజీ, 45 కెమిస్ట్రీ) ఆ గెస్ పేపర్‌లో ఉన్నాయని ప్రచారం జరగటంతో దేశవ్యాప్తంగా ఆందోళన మొదలైంది. అయితే బిజెపి ఏలుబడిలోని రాజస్తాన్ ప్రభుత్వం పరీక్ష నిర్వహనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శలు వెల్లువెత్తాయి. వీటిని ఒక రోజు ముందు 5 లక్షలకు, పరీక్షకు గంట ముందు 30 వేలకు అమ్మకాలు జరిగాయని పలువురు తెలిపారు.

**నీట్ త్వరలో నిర్వహిస్తాం : ఎన్ టిఏ డైరెక్టర్**

పేపర్ లీకేజీ ఆరోపణలపై నీట్ యుజి 2026 రద్దుకు బాధ్యత వహిస్తూ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ, తిరిగి పరీక్ష షెడ్యూల్ "తదుపరి ఏడు నుండి పది రోజులలో" ప్రకటిస్తామని తెలిపారు."తిరిగి పరీక్ష తేదీ కోసం, నేను నా బృందంతో కూర్చుని, తదుపరి కొన్ని రోజులలో పూర్తి పరీక్ష షెడ్యూల్, తేదీలను ప్రకటిస్తాను. వైద్య కళాశాలల విద్యా క్యాలెండర్, ప్రవేశ షెడ్యూల్ దెబ్బతినకుండా వీలైనంత తక్కువ సమయంలో పరీక్షను నిర్వహించడానికి ప్రయత్నిస్తాం. ఈ ప్రక్రియ తదుపరి ఏడు నుండి పది రోజులలో ప్రారంభమవుతుంది," అని సింగ్ అన్నారు. తిరిగి పరీక్షకు అభ్యర్థుల నుండి అదనపు రుసుము వసూలు చేయమని, గతంలో చెల్లించిన రుసుము తిరిగి చెల్లిస్తామని ఆయన తెలిపారు. ?

**నాసిక్ లో నిందితుడి అరెస్టు**

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో నీట్–యూజి పేపర్ లీకేజీపై దర్యాప్తు కొనసాగుతోంది. నాసిక్ నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ కిరణ్ కుమార్ చవాన్ వెల్లడించిన వివరాల ప్రకారం, నీట్ కేసులో నింది తుడికి సంబంధించి రాజస్థాన్ పోలీసులు సమాచారం అందించారు. దీంతో క్రైమ్ బ్రాంచ్ నిందితుడిని అదుపులోకి తీసుకుందని, అతడిని రాజస్థాన్ పోలీసులు అప్పగిస్తామని కిరణ్ చవాన్ తెలిపారు. నిందితుడు నాసిక్‌లోని నందగావ్ గ్రామానికి చెందినవాడని , బిఎఎంఎస్ చదువుతున్నాడని తెలిసింది. ?

**స్పందించని విద్యాశాఖ మంత్రి..**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ పేపర్ లీకేజీపై స్పందించడానికి నిరాకరించారు. సిఐఐ సమ్మిట్ లో పాల్గోవడానికి వచ్చిన ఆయన మీడియా అడిగిన ప్రశ్నలకు జవాబు ఇవ్వకుండా కారు ఎక్కి వెళ్లి పోయారు. అయితే పేపర్ లీకేజీపై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

**ప్రతిపక్షాల ఆగ్రహం..**

నీట్ పరీక్ష రద్దుపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నీట్ యుజి 2026 పరక్ష రద్దుపై మోడీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'అమృత కాలం' దేశానికి 'విష కాలం'గా మారిందని అన్నారు . ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నీట్ పరీక్ష రద్దుతో ప్రభావితమైన విద్యార్థులు సామూహిక నిరసనలకు దిగాలని పిలుపునిచ్చారు, ప్రభుత్వం ఆందోళన భాషను మాత్రమే అర్థం చేసుకుంటుందని విమర్శించారు. ఆర్జేడీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు తేజస్వి యాదవ్ 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు "మరోసారి ఆటబొమ్మగా మారింది" అని అన్నారు. పరీక్షను రద్దు చేయడంపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డిఎంకె పార్టీ అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ మండిపడ్డారు. నీట్ పేపర్ లీక్ తో లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారని అన్నారు. నీట్ పరీక్ష ప్రక్రియలో ప్రతి దశలోనూ మోసాలు ఉన్నట్లు కనిపిస్తుందని, అసలు నీట్ పరీక్షా విధానమే ఒక పెద్ద కుంభకోణం అని వ్యాఖ్యానించారు. కేరళం మాజీ విద్యాశాఖ మంత్రి వి. శివన్‌కుట్టి మాట్లాడుతూ, పరీక్ష రద్దు "కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల తీవ్ర నిర్లక్ష్యం, అజాగ్రత్తను" బహిర్గతం చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్షాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు నిర్వహించారు. ఢిల్లీలోని కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ కార్యాలయం వద్ద భారత విద్యార్థి సమాఖ్య( ఎస్ఎఫ్ఐ) ఆందోళన చేపట్టింది. విద్యార్థులకు న్యాయం చేయాలని, మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విదార్థులను పోలీసులు బలవంతం గా అరెస్టు చేసి అక్కడి నుండి తరలించారు.

## అస్సాం ముఖ్యమంత్రిగా రెండోసారి

# హిమంత బిశ్వ శర్మ ప్రమాణస్వీకారం

(మొదటిపేజీ తరువాయి)



హిమంతతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో కేంద్ర మాజీ మంత్రి రామేశ్వర్ తేలి, అసోం గణ పరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) నేత చరణ్ బోరో, సీనియర్ బీజేపీ నేత అజంత నియోగ్ ఉన్నారు.

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్‌తో పాటు 22 ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు హాజరయ్యారు. వీరితో పాటు అస్సాంలోని వైష్ణవ మతాలకు చెందిన 15 మంది సత్రాధికారులు వంటి ప్రముఖ మత పెద్దలు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి స్పష్టమైన ఆధిక్యంతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో హిమంత బిశ్వ శర్మ రెండోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఆయన తొలిసారిగా 2021లో సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాయకత్వంలో బీజేపీ ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలో తన రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ప్రమాణ స్వీకారానికి ముందు బీజేపీ, ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా హిమంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అనంతరం ఆయన గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

# వైద్యఆరోగ్యశాఖ ప్రక్షాళన...



(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి పెండింగ్‌లో ఉన్న సర్వీసు పరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్యదర్శి సౌరభ్ గౌరవ్‌కు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఉద్యోగులు ఆందోళన చెందకుండా, వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, దీనివల్ల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలో చేపట్టబోయే సాధారణ బదిలీల ప్రక్రియపై మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. బదిలీలు ఎటువంటి పైరవీలకు తావులేకుండా, అత్యంత సజావుగా సాగాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఉద్యోగికి న్యాయం జరిగేలా బదిలీల షెడ్యూల్ రూపొందించాలని, ఈ ప్రక్రియలో ఎక్కడా చిన్నపాటి అవాంతరాలు కూడా ఎదురుకాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**సొంత వ్యాపకాలతో డ్యూటీలకు గైర్హాజరు**

మరో వైపు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న 51 మంది వైద్యులను విధుల నుంచి తొలగించినట్లు మంత్రి తెలిపారు. వీరిలో 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్ ప్రకారం ఏడాదికిపైగా విధులకు గైర్హాజరవుతున్న వారిని ఉద్యోగానికి రాజీనామా చేసినట్లుగా పరిగణించి చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. అయితే నేరుగా చర్యలు తీసుకోకుండా ముందుగా సంజాయిషీ నోటీసులు ఇచ్చి సమయం కూడా ఇచ్చామని వివరించారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో చివరకు తొలగింపు చర్యలు తీసుకున్నామన్నారు.విధుల నుంచి తొలగించిన వారిలో కొందరు చాలా కాలంగా ఆస్పత్రులకు రాకపోవడం బయటపడింది. ఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన ఓ అసోసియేట్ ప్రొఫెసర్ 2020 ఫిబ్రవరి నుంచి విధులకు హాజరుకావడం లేదని అధికారులు గుర్తించారు. మరికొందరు 2022 నుంచి కూడా విధులకు దూరంగా ఉన్నట్లు తేలింది. ట్యూటర్లలో ఒకరు ఏకంగా ఏడేళ్లుగా విధులకు రాకపోవడం సంచలనంగా మారింది. కడప, అనంతపురం, ఒంగోలు, తిరుపతి, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, నెల్లూరు, మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన వైద్యులు ఈ జాబితాలో ఎక్కువగా ఉన్నారు.ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. కొందరు వైద్యులు సొంత వ్యాపకాలు, ప్రైవేట్ ప్రాక్టీసులు చూసుకుంటూ ప్రభుత్వ విధులకు దూరంగా ఉన్నట్లు గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రెగ్యులర్ నియామకాల ద్వారా ప్రభుత్వ సేవల్లో చేరినప్పటికీ.. కొందరు ఆస్పత్రులకు రాకుండా వేతనాలు పొందుతున్నారన్న ఫిర్యాదులు చాలా కాలంగా వస్తున్నాయి. దీనివల్ల బోధనాసుపత్రుల్లో వైద్య సేవలు దెబ్బతింటున్నాయని ప్రభుత్వం భావించింది. ప్రత్యేకంగా మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నివేదికలు రావడంతో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది.వైద్యులు విధులకు హాజరుకాకపోవడంపై మంత్రి సీరియస్ కావడంతో డీఎంఈ అధికారులు పూర్తి స్థాయి తనిఖీలు చేపట్టారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి హాజరు వివరాలు తెప్పించారు. ఎవరు ఎంతకాలంగా విధులకు దూరంగా ఉన్నారు? ఎవరికి నోటీసులు ఇచ్చారు? ఎవరెవరు స్పందించారు? అనే అంశాలపై ప్రత్యేక జాబితా సిద్ధం చేశారు. తర్వాత నిబంధనల ప్రకారం తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మరో ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా చర్యలు ప్రస్తుతం తొలగించిన 51 మందిలో ప్రొఫెసర్లు లేరు. అయితే దీర్ఘకాలంగా విధులకు దూరంగా ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా త్వరలో చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొత్తం ఐదుగురు ప్రొఫెసర్లు దీర్ఘకాలంగా గైర్హాజరైనట్లు గుర్తించగా.. నోటీసుల తర్వాత ఇద్దరు తిరిగి విధుల్లో చేరినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిపై చర్యలకు రంగం సిద్ధమవుతోందిఇంకా ఏడాది పూర్తి కాకపోయినా దీర్ఘకాలంగా విధులకు రాని మరో 33 మంది వైద్యులకు ఛార్జిమెమోలు జారీ చేశారు. వీరిలో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. ఇప్పటికే 11 మంది వైద్యులు నోటీసుల తర్వాత తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారు కూడా వెంటనే హాజరుకాకపోతే.. ఏడాది గడువు దాటిన తర్వాత వారిపైనా ఉద్వాసన చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. "బాధ్యతారాహిత్యాన్ని ఉపేక్షించం" విధుల నిర్వహణలో అలక్ష్యం, నిర్లక్ష్యం సహించబోమని మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉంటారని.. ఇష్టానుసారంగా విధులకు దూరంగా ఉండటం తీవ్రమైన విషయం అని పేర్కొన్నారు. "ప్రభుత్వ సేవలో ఉంటూ విధులకు హాజరుకాకపోవడం అనేది చిన్న విషయం కాదు. రోగులకు నష్టం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు? బాధ్యతారాహిత్యాన్ని ప్రభుత్వం ఉపేక్షించే పరిస్థితి లేదు" అని మంత్రి స్పష్టం చేశారు.ఒకవైపు గైర్హాజరు వైద్యులపై చర్యలు తీసుకుంటూనే.. మరోవైపు ఖాళీల భర్తీపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. జీరో వేకెన్సీ పాలసీ కింద వెంటనే నియామకాలు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటోంది. బోధనాసుపత్రుల్లో వైద్యులు, అధ్యాపకుల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పలు పోస్టుల భర్తీ ప్రక్రియ వేగవంతం చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ తాజా చర్యలతో బోధనాసుపత్రుల్లో డ్యూటీలకు గైర్హాజరు అయ్యే వైద్యుల్లో ఆందోళన మొదలైనట్లు తెలుస్తోంది. ఇకపై విధులకు డుమ్మా కొడితే కఠిన చర్యలు తప్పవన్న సంకేతాన్ని ప్రభుత్వం స్పష్టంగా ఇచ్చిందని వైద్య వర్గాలు భావిస్తున్నాయి.

## తోకగుట్ట గంగమ్మకు ఘనంగా పొంగళ్ళు



**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 12:** రామచంద్రాపురం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ తోక గుట్టలో వెలసి వున్న గ్రామదేవత తోకగుట్ట గంగమ్మకు గ్రామస్తులు తిరుపతి గంగ జాతర సందర్భంగా మంగళవారం ఘనంగా పొంగళ్ళు పెట్టి పూజలు నిర్వహించారు. ప్రతి యేడు మాదిరిగానే ముందుగా గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి పొంగళ్ళు తీసుకుని మహిళలు ఊరేగింపుగా అమ్మవారి దేవాలయం చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగళ్ళు వండారు. అనంతరం అమ్మవారిని పసుపు కుంకుమ పూలతో విశేషంగా అలంకరించి, వండిన పొంగళ్లను నైవేద్యంగా పెట్టి బలిని నివేదించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యేటా తిరుపతి లోని తాతయ్య గుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని మా గ్రామదేవత తోకగుట్ట గంగమ్మతల్లికి తమ గ్రామంలో అందరూ కుల మతాలకతీతంగా ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ సుందర్ రెడ్డి, తంజావూరు మధు, మనో హర్ రెడ్డి, సింగ్ హరీష్, తంజావూరు సునీల్, పెనుగొండ రాజశేఖర్, పెనుగొండ వీరభద్ర, మనోహర్, తంజావూరు రవి, వెంకటేష్ నాడారు, మనోహర్ నాడారు, ధనశేఖర్ నాడారు, బాదూరు వంశీబాల, ఠాగూర్ మహేష్, మహిళలు నీలమ్మ, సునీత, మునెమ్మ, లక్ష్మమ్మ, గీత, కోటమ్మ, లత, నదియా, కావ్య, దివ్య, తేజ, రూప, కళ, మౌనిక పాల్గొన్నారు.

## రేణిగుంట లోహోమియోపతి వైద్య శిబిరం



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 12 :** రేణిగుంట సచివాలయం ఆవరణంలో మంగళవారం హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు.రేణిగుంటలో ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని హోమియోపతి క్లినికల్ రీసెర్చ్ యూనిట్ సభ్యులు మరియు సామాజిక సేవకుడు ఎంజి.రెడ్డి సంయుక్తంగా ఉచిత హోమియోపతి వెల్‌నెస్ కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు రూ.1800/- విలువ గల హోమియోపతి మందుల కిట్‌లను 200 మంది ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, సాధారణ ఆరోగ్య సమస్యలకు హోమియోపతి వైద్యం ఉపయోగకరమనే విషయాన్ని తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రవిచంద్ర రెడ్డి, హారిక రెడ్డి మరియు వారి సహాయక బృందం పాల్గొని ప్రజలకు హోమియోపతి మందుల వినియోగం, ప్రయోజనాల గురించి వివరించారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని, భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆరోగ్య సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## రేణిగుంటలో గంజాయి వ్యతిరేక అవగాహన సదస్సు




**రేణిగుంట – ఆంధ్రనాడు మే 12:** రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో రేణిగుంట అర్బన్ పోలీసులు మంగళవారం గంజాయి వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని తిరుపతి జిల్లా ఈగిల్ టీమ్ సీఐ జయచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో 'ఈగిల్' ఆధ్వర్యంలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జయచంద్ర మాట్లాడుతూ సమాజానికి శాపంగా మారిన గంజాయిని నిర్మూలించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. విద్యార్థులు, యువత సరదా కోసం అలవాటు చేసుకునే వ్యసనాలు వారి జీవితాలను చీకటిమయం చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా లేదా వినియోగించినా కఠిన చట్టపరమైనచర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి సాగు, రవాణా లేదా విక్రయాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే 1907 టోల్ ఫ్రీకు ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. సమాజం నుండి గంజాయిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈగిల్ టీమ్ సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు, స్థానిక యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అంటూ రాసి ఉన్న ప్లకార్డులతో అవగాహన కల్పించారు.

## గంగమ్మ జాతరకు అదనపు రైళ్లు కోరుతూ వినతి...

**కుప్పం – ఆంధ్రనాడు, మే 12:** కుప్పం గ్రామ దేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తాదులకు అదనపు రైళ్లు మంజూరు చేయాలని సాయి మాతా సేవ ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు రైల్వే అధికారులను కోరుతూ మంగళవారం వినతి పత్రం అందజేశారు. దక్షిణ భారతదేశంలోనీ 3 రాష్ట్రాల కూడలిలో గల కుప్పంలో అత్యంత వైభవంగా జరిగే శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారి జాతర సందర్భంగా ఈనెల 14వ తేదీ నుండి 21వ తేదీ వరకు కుప్పం రైల్వే స్టేషన్ కు బెంగళూరు నుండి చెన్నై, చెన్నై నుండి బెంగళూరు వైపు వెళ్లే అన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లను ఒక నిమిషం పాటు నిలుపుదల చేయాలని, పుష్పుల్ రైలును 4 ట్రిప్పులు నడపాలని కోరుతూ బెంగళూరులోని దక్షిణ పశ్చిమ రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ వారి కార్యాలయంలోనీ డివిజనల్ రైల్వే మేనేజర్ తోష్ అశ్రుతోష్ కుమార్ సింగ్ కోరినట్లు జగదీష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై డిఆర్ఎం స్పందిస్తూ సాధ్యమైనంత త్వరలో వీలైనన్ని రైళ్ళను కుప్పంలో జాతర సందర్భంగా వారం రోజుల పాటు నిలుపుదలకు కృషి చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. డిఆర్ ఎంని కలిసిన వారిలో కుప్పిగానపల్లి నాగరాజునాయుడు, కిషోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

**- విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల వేట**
**- పదో తరగతి ఫలితాల కరపత్రాలతో ఇంటింటి ప్రచారం**




**తిరుపతి – ఆంధ్రనాడు, మే 12:** బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలని ఉద్దే శంతో ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల కరప త్రాలతో విద్యార్థులు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మురళి, నాదెండ్ల మురళి, రమేష్, సుజన, దాసు తదితరులు పాల్గొన్నారు. మంగళవారం అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కలిసి పాఠశాలలో కరపత్రాలను ఆవిష్కరించారు. మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల్లో 568 మార్కులతో కల్లి వెట్టు ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా కల్లివెట్టు, తలారి వెట్టు పంచాయ తీల్లో "మన ఊరి పాఠశాలలో మీ పిల్లలను చేర్పించండి" అంటూ గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ప్రతి విద్యార్థికి "తల్లికి వందనం", "సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్" ద్వారా మూడు జతల యూనిఫాంలు, స్కూల్ బ్యాగ్, బూట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం" ద్వారా పౌష్టికాహారం, వారానికి 5 గుడ్లు, రాగి జావ, చిక్కీ అందిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, ఐ.ఎఫ్. పి. ప్యానల్ ద్వారా నాణ్యమైన బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్ర భుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సౌకర్యాలు, విద్యా ప్ర మాణాల గురించి ప్రజలకు తెలియజేస్తూ కరపత్రాలు పంచుతున్నట్లు తెలిపారు.

# గంగమ్మల చేతుల మీదుగా ఆంగ్ల గ్రంథావిష్కరణ



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 12:** తిరుపతి గంగ జాతర వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి రచించిన "ది ఫోక్ ఫెస్టివల్ ఆఫ్ గంగ జాతర ఇన్ తిరుపతి" ఆంగ్ల గ్రంథాన్ని మంగళవారం గంగమ్మల వేషధారణలో ఉన్న కైకాల వంశస్థులు ఆవిష్కరించారు. సున్నపు కుండలు వేషంలో పెద్ద గంగమ్మ, చిన్న గంగమ్మలుగా దర్శనమిచ్చిన అక్కాచెల్లెళ్లు గ్రంథావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా గంగమ్మలు ఆవహించిన కైకాల వారు మాట్లాడుతూ., పేట శ్రీనివాసులు రెడ్డి గతంలో తెలుగులో 'తిరుపతి గంగ జాతర' పుస్తకాన్ని రెండు ఎడిషన్లుగా ప్రచురించారని తెలిపారు. ప్రస్తుతం ద్రావిడ విశ్వవిద్యాలయం ద్వారా వెలువడిన 120 పేజీల ఆంగ్ల గ్రంథం గంగ జాతర విశిష్టతను మరింత విస్తృతంగా పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ., తాను గంగ జాతర వాతావరణంలోనే పెరిగానని, ఈ జాతర సంప్రదాయాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలియజేయాలనే ఉద్దేశంతో గ్రంథాన్ని రచించినట్లు చెప్పారు. వందేళ్ల క్రితం గంగ జాతర నిర్వహణ విధానం, ప్రస్తుతం జరుగుతున్న తీరు గురించి ప్రత్యేక అధ్యాయంలో వివరించినట్లు తెలిపారు. భవిష్యత్తులో తమిళం, కన్నడ భాషల్లో కూడా ఈ గ్రంథాన్ని ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గంగ జాతరలో వంశపారంపర్యంగా వేషాలు వేసే కైకాల వారు, రజకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చైతన్యపురం యానాదులకు అవగాహన సదస్సు



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 12:** రేణిగుంటమండలం చైతన్యపురం ఎస్టి కాలనీలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్స్ మాడ్యూల్స్ జీవన నైపుణ్యాలపై బాలలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి మాట్లాడుతూ బాల్య దశలోనే జీవన నైపుణ్యాలు పెంపొందించు కోవాలని స్వీయ గుర్తింపు సమూహ గుర్తింపు విభిన్న రకాల ఆలోచనలలోని తేడాలు ఇతరుల కంటే భిన్నంగా ఆలోచించడం కాలానుగుణంగా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడం జీవితంలో ఎదురయ్యే బాల్య దశ నుండి ఎలాంటి ఒడిదుడుకులు ఎదుర్కొని నైపుణ్యాలు పెంపొందించుకుని ఇతరుల కంటే భిన్నంగా అభివృద్ధి సాధించాలని బాలలకు సంబోధించారు. స్వీయ గుర్తింపులో వ్యక్తుల వయస్సు లింగం విద్యా సామర్థ్యం వైకల్యం ప్రతిభ పిల్లల అభివృద్ధి వివిధ దశల్లో జరుగుతుందని మరియు వారి పరిసరాల ప్రభావంతో పిల్లలకు స్వతంత్రంగా తమ పనులను పూర్తి చేసే అవకాశం కల్పించాలని అప్పుడు తమదైన శైలిలో భిన్నంగా ఆలోచించి అసాధారణంగా తమ శక్తి సామర్థ్యాలు వివిధ రంగాల్లో ప్రదర్శిస్తారని అన్నారు. రేణిగుంట మండల కన్వీనర్ జయలక్ష్మి, ప్రగతి సిబ్బంది సురేష్, విద్యార్థులు పాల్గొని వివిధ రకాల ప్రదర్శనలు నిర్వహించారు.

# చోరీలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగ అరెస్టు

**- రూ.8 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువుల స్వాధీనం**



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 12:** తిరుపతి జిల్లాలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రాత్రి, పగలు సమయాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను తిరుచానూరు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.8 లక్షల విలువైన 57 గ్రాముల బంగారు ఆభరణాలు, 512 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తిరుచానూరు తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ) బి. సునీల్ కుమార్ మాట్లాడుతూ., జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు సీసీఎస్ అదనపు ఎస్పీ ఎ. శ్రీనివాసులు ఆదేశాల మేరకు చంద్రగిరి డిఎస్పి ప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచినట్టు తెలిపారు. ఈ క్రమంలో మంగళంలోని ఆశ కళ్యాణ మండపం సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వరదరాజుల మణి (32)ను అదుపులోకి తీసుకుని విచారించగా పలు చోరీ కేసుల్లో అతని ప్రమేయం వెలుగులోకి వచ్చిందని, జీవకోన నవజీవన్ కాలనీకి చెందిన మణిపై అలిపిరి, సీసీఎస్, రొంపిచర్ల, తిరుచానూరు, తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటికే 19 కేసులు నమోదై ఉన్నట్లు, విలాసవంతమైన జీవితం కోసం చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. మంగళం తుడా క్వార్టర్స్ పరిధిలో జరిగిన చోరీ కేసుతో పాటు ఇతర కేసుల్లోనూ రికవరీ చేపట్టినట్లు వెల్లడించారు. కేసును ఛేదించిన తిరుచానూరు ఇన్స్పెక్టర్ బి.సునీల్ కుమార్, ఎస్ఐలు, క్రైమ్ పార్టీ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి నగదు బహుమతులు ప్రకటించినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.సునీల్ కుమార్ తెలిపారు.

# గోవాలో ఇంటర్ విద్యార్థి



**- తిరుచానూరు పోలీసుల ప్రత్యేక గాలింపుతో సురక్షితంగా ఆచూకీ**

**- పరీక్షల భయంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు వెల్లడి**

**తిరుపతి రూరల్ - ఆంధ్రనాడు, మే 12:** తిరుచానూరు పోలీసుల ప్రత్యేక గాలింపు చర్యలతో తప్పిపోయిన ఇంటర్మీడియట్ విద్యార్థిని గోవా రాష్ట్రంలోని వాస్కో ప్రాంతంలో సురక్షితంగా గుర్తించినట్లు తిరుచానూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ) సునీల్ కుమార్ తెలిపారు. గీతం జూనియర్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న సి. జస్వంత్ రెడ్డి (17) మార్చి 11న కళాశాల నుంచి ఎవరికీ సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయాడు. ఈ విషయమై కాలేజ్ ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేయడంతో తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, చంద్రగిరి డిఎస్పి ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలతో గాలింపు చేపట్టి మంగళవారం గోవాలోని వాస్కో ప్రాంతంలో విద్యార్థిని గుర్తించారు. స్థానిక పోలీసుల సమక్షంలో విచారించగా, ఇంటర్ ఫైనల్ పరీక్షలు సరిగా రాయకపోవడంతో భయాందోళనకు గురై వెళ్లిపోయినట్లు బాలుడు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. విద్యార్థులపై అధిక ఒత్తిడి తీసుకురాకుండా వారి మానసిక పరిస్థితులపై తల్లిదండ్రులు, విద్యాసంస్థలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. పిల్లలు కనిపించకుండా పోయిన ఘటనల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# ఎలమండ్యం కాలనీలో గంగ జాతర



**రేణిగుంట - ఆంధ్రనాడు, మే 12:** రేణిగుంట మండలంలోని ఎల్లమండ్యం కాలనీలో తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకొని గ్రామ దేవత మారమ్మ చెంత గత మూడు వారాలుగా సాగుతున్న అంబళ్ల ఉత్సవం మంగళవారం ఆధ్యాత్మిక శోభ మధ్య ముగిసింది. ఉదయం నుంచే అమ్మవారికి సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన భక్తులు, కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. అనంతరం సిద్ధం చేసిన అంబళ్లను అమ్మవారికి నైవేద్యంగా పెట్టి, ప్రసాదంగా గ్రామ ప్రజలందరికీ పంపిణీ చేశారు. సాయంత్రం వేళ గ్రామ పరిసర ప్రాంగణంలో గంగమ్మ శిలలుగా ఏర్పాటు చేసి, అలంకరించి మరింత కోలాహలంగా మారింది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మహిళలు సంప్రదాయబద్ధంగా పొంగళ్లు వండి అమ్మవారికి అర్పించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, పెద్దలు వివిధ రకాల వేషధారణలతో అలరించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు వెయ్యి కన్నుల కుండలను నెత్తిన పెట్టుకుని అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, ఆ కుండలలోని కుడుములను నైవేద్యంగా సమర్పించడం అందరినీ ఆకట్టుకుంది. తరతరాలుగా వస్తున్న ఈ ఆచారాలను పాటించడం వల్ల గ్రామ ప్రజలందరికీ ఆరోగ్య సమస్యలు తొలగి, సంపూర్ణ ఆయురారోగ్యాలు లభిస్తాయని గ్రామ పెద్దలు తెలిపారు. ఏటా అత్యంత నిష్ఠతో నిర్వహించే ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. గ్రామ పెద్దమనుషులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత క్రమశిక్షణతో, సంప్రదాయబద్ధంగా జరిగింది.

# వైభవంగా కోటకొండ గంగమ్మ ఊరేగింపు



**తంబళ్లపల్లి - ఆంధ్రనాడు,మే 12:** తంబళ్లపల్లి మండల కేంద్రానికి సమీపంలోని సంతోపులో వెలసిన కోటకొండ గంగమ్మ అమ్మవారిని మంగళవారం పల్లకిపై వైభవంగా ఊరేగించారు. బుధ, గురువారాల్లో తంబళ్లపల్లి కోటకొండ గంగమ్మ జాతర సందర్భంగా సోమవారం వివిధ పుష్పాలతో అలంకరించిన పల్లకిపై అమ్మవారిని కొలువు దీర్చారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ తంబళ్లపల్లి, పరశుతోపు గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో ఊరేగిస్తూ అమ్మవారికి ఇంటింటి పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కాయ కర్పూరాలు సమర్పించి పూజలు చేశారు.

# గ్రీన్ షాపులతో స్వచ్ఛతకు శ్రీకారం







**చంద్రగిరి - ఆంధ్రనాడు, మే 12:** గ్రీన్ షాపులతో స్వచ్ఛతకు శ్రీకారం చుట్టవచ్చును అని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన గ్రీన్ షాప్ ను యంయల్ఏ నాని రిబ్బన్ కత్తరించి ప్రారంబించారు. చంద్రగిరి నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లా యంత్రాంగం చంద్రగిరి గ్రామపంచాయతీని ఎంపిక చేసినది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి అర్చకులు జిల్లా, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా షాపును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి ప్రజల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి గ్రీన్ షాప్ లోని వస్తువులను ఇప్పించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2047 విజన్ లో భాగంగా స్వచ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంను చేపట్టారని చెప్పారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఎంపిక చేసిన పంచాయతీలలో గ్రీన్ షాప్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నార గ్రీన్ షాప్ నందు పొడి వ్యర్థాలను ప్రజల నుండి సేకరించి వాటికి బదులుగా ఇంటి నిత్యావసర వస్తువులను ఇచ్చు కేంద్రం. ప్రజలు పొడి వ్యర్థాలను (ప్లాస్టిక్, కాగితం, గాజు, లోహం, మొదలైనవి) గ్రీన్ షాప్ కు తీసుకువచ్చి దానికి సరిపడా వస్తు మార్పిడి పద్ధతి ద్వారా నిత్యవసర వస్తువులను తీసుకునే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రజల నుంచి సేకరించిన వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి పర్యావరణానికి నష్టం కలగకుండా చూస్తారన్నారు. గ్రీన్ షాప్ లో కేజీలలో వస్తువులు సేకరణ ఇనుముకు (25), పేపర్ (20), పుస్తకాలు (10), అట్టే పెట్టాలు (10), ప్లాస్టిక్ బాటిల్ (25), గాజు బాటిల్ (03), స్టీల్ వస్తువులు (45), అల్యూమినియం (150) రూపాయలు చొప్పున కొనుగోలు చేస్తారన్నారు. ఈ గ్రీన్ షాప్ ద్వారా ఇంటిలోని వ్యర్థాలను తీసుకువెళ్లి, ఇంటికి సరిపడే నిత్యావసర వస్తువులను తీసుకోవచ్చని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అదే విధంగా ఎమ్మెల్యే పులివర్తి నాని కోరిక మేరకు తిరుపతి రూరల్ మండలంలో మేజర్ పంచాయతీలు అయిన అవిలాల, గాంధీ పురం, పద్మావతి పురం, శ్రీనివాసపురం, తిరుచానూరు పంచాయతీలలో త్వరలోనే గ్రీన్ షాపులు ఏర్పాటు చేస్తామని డిపిఓ సుశీల దేవి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# పల్ల శ్రీనివాసులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెదేపా నాయకులు...

**కేవీబీపురం - ఆంధ్రనాడు, మే 12:** జన్మదిన సందర్భంగా శ్రీవారి దర్శనానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ కు కేవీబీ పురం మండల నాయకులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం తిరుపతి విమానాశ్రయంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మునస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి జన్మదిన అభినందనలు తెలియజేశారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం వారి ప్రసాదాలను సమర్పించి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా మునస్వామి యాదవ్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి పల్లా శ్రీనివాస్ యాదవ్ విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. శ్రీవారి కృపతో ఆయురారోగ్యాలు కలిగి ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని



ఆకాంక్షించారు. కార్యక్రమంలో తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబు నాయుడు, మండల యువత అధ్యక్షుడు వాసు నాయుడు, పాలేకర్ సంఘ అధ్యక్షుడు వెంకట కృష్ణయ్య, ముకుంద యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కేవీబీపురంలో ఘనంగా పల్లా శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు

**కేవీబీ పురం - ఆంధ్రనాడు, మే 12:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మునస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మునస్వామి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో ప్రజాభిమానాన్ని సంపాదించుకున్న నాయకుడిగా పల్లా శ్రీనివాస్ యాదవ్ గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అత్యధిక మెజారిటీతో విజయం సాధించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్న నాయకుడిగా ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి ఆయన చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి నూతన ఉత్సాహాన్ని తీసుకువస్తూ యువతలో ప్రత్యేక ఆదరణ పొందుతున్న పల్లా శ్రీనివాస్ యాదవ్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ నాయకులు జన్మదిన శభా



కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబు నాయుడు, పాలేయకరి సంఘం అధ్యక్షుడు వెంకట కృష్ణయ్య, మండల యువత అధ్యక్షుడు వాసు నాయుడు, తెదేప నాయకులు మునికృష్ణయ్య, కరపా రెడ్డిబాలు, వేణు, మునికృష్ణ, మహేంద్ర, నాగరాజు, సుమన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు కొరకే ప్రత్యేక డ్రైవ్




**తొట్టంబేడు - ఆంధ్రనాడు, మే 12 :** ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు కొరకే ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం సహిత విద్య ఉపాధ్యాయుల బృందం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు బడి బయట ఉండకూడదు అనే ప్రభుత్వం ఉద్దేశంతో పిల్లల యొక్క సమాచారాన్ని సేకరించి బడి బయట ఉన్న వారిని ప్రభుత్వ పాఠశాలలో మరియు భవిత కేంద్రాలలో చేర్పించే దిశగా మండల సహిత ఉపాధ్యాయులు ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ దివ్యాంగులను గుర్తించి వారికి ప్రభుత్వం అందిస్తున్నటువంటి సేవలను గూర్చి వివరించడం వంటి విషయాలను తల్లిదండ్రులతో చర్చించారు. అలాగే తల్లిదండ్రులకు భవిత కేంద్రం అందిస్తున్నటువంటి సేవలు, సహాయ సహకారాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సహిత విద్య ఉపాధ్యాయుడు చైతన్య, జనార్ధన్ పాల్గొన్నారు.

# సమాజ సేవలో ఎస్సై బాలకృష్ణ

**శ్రీకాళహస్తి - ఆంధ్రనాడు, మే 12 :** విధి నిర్వహణలో తన వంతు కర్తవ్యాన్ని నెరవేరుస్తూ మండలంలోని ప్రజలకు తానున్నాను అంటూ భరోసా ఇస్తున్న ఎస్సై బాలకృష్ణ సామాజిక సేవలోనూ ముందుంటున్నారు. అందులో భాగంగానే మండలంలోని శ్రీకాళహస్తి - తడ మార్గంలో బీడీ కాలనీ సమీపంలో మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు సంభవిస్తూ ఉంటుంది. ఈ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు మంగళవారం ఎస్సై స్థానిక ఆర్టీవో దామోదర్ నాయుడుతో కలిసి చర్యలు చేపట్టారు. ఆర్ అండ్ బి అధికారులతో కలిసి నిత్యం ప్రమాదాలు జరగడానికి గల కారణాలను అన్వేషించి నివారణకు పలు సూచనలు చేశారు. అలాగే జెసిబి తో రోడ్డు పక్కన ఉన్నటువంటి గుంతలను చదును చేశారు. దీంతో మండల ప్రజలు ఎస్సై సేవలను కొనియాడడంతో పాటు మన్ననలు కురిపిస్తున్నారు.



# కిశోరి వికాసంతో ఉజ్వల భవిత



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 12:** కిశోరి వికాసం బాలికల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ రమణమ్మ, డీసీపీడబ్ల్యూ కో ఆర్డినేటర్ షకీలా భాను అన్నారు. మంగళవారం కొటాల అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, ఫోక్సో చట్టం, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, పిల్లల హక్కులు, పౌష్టికాహారం వల్ల ఉపయోగాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కిశోరి బాలికలు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పీ జ్యోతి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో బంతి తోటకు మచ్చ... మార్కెట్లో కొనే నాధుడు కరువు




**- పొలంలో దిగుబడి చూసి తట్టుకోలేక పశువులు వదిలి మేపేస్తున్న రైతన్న**

**- ఆరు కోతలు కోసుకొన్నా...వర్షం దెబ్బకు తోటకు మచ్చలొచ్చేసాయ్**

**బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, మే 12:** బైరెడ్డిపల్లి మండలంలోని పాతూరీనత్తశీ గ్రామానికి చెందిన శ్రీ రాజప్ప అనే రైతన్న తనకున్న పొలంలో ఎకరా బంతి (వకల్ ఎల్లో) సాగు చేసాడు. పంట దిగుబడి చాలా అద్భుతంగా వచ్చిశీది. శాంపిల్ పూలు మార్కెట్లో ధరలు లేక మూట రూ.150 తో ఇచ్చేసాడు.ఇలా రెండు కోతలు ఇదే తంతు జరిగింది. మూడవ కోత వచ్చే సమయానికి ధరలు పుంజుకొన్నాయి. తోట వద్దే వ్యాపారీ వచ్చి పూలను కొనుగోలు చేసుకున్నాడు. మంచి ధర పలకడంతో రైతు కష్టం మిగిలింది. ఇదే ధరలు ఉంటే మంచి లాభాలు ఆర్జించవచ్చని రైతన్న కళలు కన్నాడు. కానీ ఇంతలోనే అకాల వర్షం దెబ్బకొట్టింది. వర్షం ఆశించిన మేర పడక, వేడి ఉపశనం కోసం పడటంతో తోట మచ్చ పడింది. గమనించని రైతన్న మార్కెట్ కు బంతి తరలించాడు. కానీ వ్యాపారీ కొనుగులు చేయక బంతి అలానే మార్కెట్లో వదిలేసి ఇంటికి చేరుకొన్నాడు. పంట దిగుబడి చూసి ఏమి చెయ్యాలో దిక్కుతోచని స్థితిలో రైతన్న మంగళవారం బంతి పూల తోటలో పశువులను వదిలి మెపేశాడు. రైతన్న మల్చిశీగ్ వేసి సాగు చేసాడు. అకాల వర్షంతో నష్టపోయిన రైతన్నను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# సత్యవేడు పట్టణంలో పలుచోట్ల సిమెంటు రోడ్డు గుంతలు పూడ్చివేత



**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 12:** సత్యవేడు పట్టణం నేతాజీ రోడ్డు మార్గంలో సిమెంటు రోడ్డుకు పలుచోట్ల ఏర్పడ్డ గుంతలను పూడ్చి వేశారు. సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో బుధ, గురువారంలో జరగనున్న గంగ జాతరను పురస్కరించుకుని శంకర్ రెడ్డి సూచన మేరకు స్థానిక ఎస్సై సాయినాథ్ చౌదరి, నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మురళి( చికెన్ చిన్న) ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సునీల్ జైన్, సంతోష్ కుమార్ తదితరుల పర్యవేక్షణలో మంగళవారం పట్టణంలోని శ్రీకాళహస్తి మార్గం నాయుడు హోటల్ సమీపంలో సిమెంట్ రోడ్డు గుంతలను సిమెంట్ కంకర మిక్సింగ్తో పూడ్చి వేశారు. అలాగే చెన్నై మార్గంలో తమిళనాడు సరిహద్దు వద్ద బావులుగా తలపిస్తున్న గుంతలను కంకర డస్ట్ మిక్సింగ్తో పూడ్చి పటిష్టం చేశారు. దీంతో పట్టణంలో పలుచోట్ల ఏర్పడ్డ గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు తొలగించడం పట్ల పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# హశీల్దార్ కార్యాలయంలో మద్యం మత్తులో జూనియర్ అసిస్టెంట్ హల్‌చల్



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 12:** నాగలాపురం మండల తహశీల్దార్ కార్యాల యంలో పని చేస్తున్న ఓ జూనియర్ అసిస్టెంట్ మద్యం మత్తులో విధులకు హాజరై అర్జీ దారులతో దురుసుగా ప్రవర్తించిన ఘటన సోమవారం కలకలం రేపింది. కార్యా లయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలతో అసభ్యంగా మాట్లాడటం, సరిగా స్పందించకపోవడంతో బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొందరు అర్జీదారులు వెంటనే 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని సంబంధిత ఉద్యోగిని డ్రింక్ అండ్ డ్రైవ్ మిషన్ ద్వారా తనిఖీ చేశారు. పరీక్షలో అతను మద్యం సేవించినట్లు గుర్తించిన పోలీసులు సంబంధిత రిపోర్టును తహశీల్దార్‌కు సమర్పించారు. ఈ ఘటనపై స్పందించిన తహశీల్దార్, ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించడం సహించబోమని, ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సంఘటనతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు కొంతసేపు ఆందోళన వ్యక్తం చేశారు.

# తిరుపతి జిల్లాలో వడగాల్పుల నియంత్రణకు కఠిన మార్గదర్శకాలు

**- చల్లటి నీరు, నీడ సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశాలు**

**తిరుపతి కలెక్టరేట్ –ఆంధ్రనాడు, మే 12:** ఎండ వేడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని తిరుపతి జిల్లా యంత్రాంగం కీలక చర్యలు చేపట్టింది. భారత వాతావరణ శాఖ హెచ్చరికలు, కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ఆధారంగా ఈ సూచనలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వేంకటేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా ఉప కార్మిక కమిషనరు ఎస్. సురేష్ కుమార్ ఈ మార్గదర్శకాలను ప్రకటించారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలు, కాంట్రాక్టు కార్మికులు, అలాగే సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులను వడగాల్పుల ప్రభావం నుండి రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం, ప్రతి పని ప్రదేశంలో చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచడం, కార్మికులు తరచుగా నీరు త్రాగేందుకు ప్రోత్సహించడం తప్పనిసరి చేయబడింది. అలాగే ప్రత్యక్ష సూర్యరశ్మి నుండి రక్షణ కల్పించేలా నీడ ఉన్న పని ప్రదేశాలు లేదా తాత్కాలిక ఆశ్రయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మధ్యాహ్నం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే 12 గంటల నుంచి 4 గంటల వరకు బహిరంగ పనులను తగ్గించి, పని సమయాలను ఉదయం మరియు సాయంత్రం చల్లని గంటలకు మార్చాలని అధికారులు సూచించారు. కఠినమైన శ్రమతో కూడిన పనులను కూడా ఈ సమయాల్లోనే నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి పని ప్రదేశంలో ప్రథమ చికిత్స పెట్టె ఉండేలా చూడాలని, అలాగే ఓఆర్ఎస్, అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వేడి సంబంధిత అనారోగ్యాల లక్షణాలపై కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కూడా సూచించారు. అదనంగా బడ్డీ సిస్టమ్ అమలు చేసి కార్మికులు పరస్పరం ఒకరిని ఒకరు పర్యవేక్షించే విధానం ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులపై నిరంతర అప్రమత్తత కోసం రేడియో, టీవీ, వార్తాపత్రికలతో పాటు భారత వాతావరణ శాఖ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు. అలాగే పని ప్రదేశాల్లో ఉష్ణోగ్రత సూచికలు ఏర్పాటు చేసి కార్మికులకు అవగాహన కల్పించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలను తిరుపతి జిల్లాలోని అన్ని దుకాణాలు, సంస్థలు, పరిశ్రమలు, భవన నిర్మాణ సంస్థలు, ఇటుక బట్టీల యజమానులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. వడగాల్పుల కారణంగా కార్మికులకు కలిగే ఆరోగ్య ప్రమాదాలను తగ్గించడమే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

# గంగమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**- ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు**

**- అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి**

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 12 :** తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరుగుతున్న గంగమ్మ జాతర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ మంగళవారం రాత్రి పరిశీలించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం





ఆలయం పరిసరాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలు, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శారదాదేవి, ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. గంగమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్, తుడా, టీటీడీ సహకారంతో ప్రతి ఏడాది జాతరను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతర ఏర్పాట్లపై నెల రోజులుగా అధికారులతో సమీక్షలు నిర్వహించామని వెల్లడించారు. భక్తుల భద్రత కోసం ప్రత్యేక బందోబస్తు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా త్రాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జయకుమార్, దేవాదాయ శాఖ అధికారులు రామకృష్ణారెడ్డి, రామకృష్ణా తదితరులు పాల్గొన్నారు.



# కందులవారిపల్లికి జాతీయ స్థాయి గౌరవం

**- క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయత్ అవార్డు సాధించిన గ్రామపంచాయతీ**

**- రూ.1 కోటి నగదు బహుమతి దక్కించుకున్న చంద్రగిరి మండల గ్రామం**

**- సౌరశక్తి, పారిశుద్ధ్యం, ప్రకృతి వ్యవసాయంలో దేశానికే ఆదర్శంగా గుర్తింపు**









**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 12 :** తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలంలోని కందులవారిపల్లి గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించింది. నేషనల్ పంచాయతీ అవార్డ్--2026 కింద నిర్వహించిన "క్లైమేట్ యాక్షన్ స్పెషల్ కేటగిరి పంచాయత్ అవార్డు"ను ఈ గ్రామపంచాయతీ దక్కించుకొని రూ.1 కోటి నగదు బహుమతిని పొందింది. పర్యావరణ పరిరక్షణ, సౌరశక్తి వినియోగం, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాల్లో గ్రామపంచాయతీ చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. గ్రామస్థుల భాగస్వామ్యం, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, స్థానిక సంస్థల చొరవతో కందులవారిపల్లి "క్లైమేట్ స్మార్ట్ గ్రామం"గా నిలిచింది. గ్రామంలో 1,583 మంది జనాభా, 512 కుటుంబాలు నివసిస్తుండగా వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉంది. మహిళా సాధికారత కోసం 40 స్వయం సహాయక సంఘాలు పనిచేస్తుండగా, ఉపాధి హామీ పథకం ద్వారా అనేక కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. గ్రామపంచాయతీ ప్రత్యేకంగా "క్లైమేట్ యాక్షన్ కమిటీ"ను ఏర్పాటు చేసి నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, పునరుత్పాదక శక్తి వినియోగం, సహజ వ్యవసాయం వంటి అంశాలపై చర్యలు చేపట్టింది. నారా చంద్రబాబు నాయుడు చొరవతో పీఎం సూర్యఘర్ పథకం కింద గ్రామంలోని ఇళ్లలో సౌర విద్యుత్ ప్యానెల్లు ఏర్పాటు చేశారు. మొత్తం 473 సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేయగా, ఇందుకు రూ.5.67 కోట్ల పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం గ్రామంలో నెలకు సుమారు 1.13 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. గ్రామ అవసరాలకు మించి ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపిస్తున్నారు. తాగునీటి పంపులను సౌరశక్తితో నడిచేలా మార్చడంతో పాటు వీధి దీపాల్లో కూడా సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. పిఎం అజయ్ పథకం ద్వారా ఈ–ఆటోలు అందించగా, విద్యార్థుల్లో ఈ–సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఉజ్వల యోజన, దీపం 2.0 పథకాల ద్వారా ప్రతి ఇంటికి ఎల్పీజీ కనెక్షన్లు, ఎల్‌ఈడి బల్బులు అందించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ఇంటింటికీ చెత్త సేకరణ, తడి–పొడి చెత్త వేరు చేయడం, వర్మీ కంపోస్ట్ తయారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండు ఈ–ఆటోలు, స్వచ్ఛ రథం వాహనాల ద్వారా 100 శాతం చెత్త సేకరణ చేపడుతున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో రోడ్ల పక్కన, పాఠశాలల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి ఇప్పటివరకు 90 వేలకుపైగా మొక్కలు నాటారు. రైతుల్లో ప్రకృతి వ్యవసాయం, డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహిస్తూ వర్షపు నీటి సంరక్షణ కోసం రీచార్జ్ పిట్స్, ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఈ అవార్డు సాధనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ వి.ఆర్.కృష్ణతేజ మైలవరపు, తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్.వేంకటేశ్వర్ సహకారం ఎంతో కీలకమైందని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి డి.సుశీల దేవి తెలిపారు. జిల్లాలోని మరిన్ని గ్రామపంచాయతీలను ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.






# రేపు గంగమ్మకు పాతపేట నుంచి పుట్టినింటి సారె సమర్పణ




**ఆంధ్రనాడు, పలమనేరు, మే 12:** పలమనేరు పట్టణ మందలి పాతపేటలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానం నుండి గ్రామ దేవత అయిన శ్రీ తిరుపతి గంగమ్మ తల్లి జాతరలో భాగంగా గంగమ్మ తల్లికి పుట్టిన ఇంటి సారె సమర్పణ కార్యక్రమం జరుగనున్నది. ఇందులో భాగంగా గురువారం ఉదయం ఆరు గంటలకు శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారికి పంచామృత అభిషేకం, మహా మంగళహారతి అనంతరం తీర్థ ప్రసాద వినియోగం చేపడుతారు. పిదప దేవాలయం నుండి శ్రీశ్రీశ్రీ తిరుపతి గంగమ్మకు పుట్టినింటి సారె ఊరేగింపుగా తీసుకెళతారు. తిరుపతి గంగమ్మతో పాటు మార్గమధ్యంలోని శ్రీ సత్యగంగమ్మ తల్లికి కూడా సారె సమర్పిస్తారు. ఇది ఇలా ఉండగా దాదాపు 70 సంవత్సరాల క్రితం శ్రీ వేణుగోపాల స్వామి గుడి శిథిలావస్థకు చేరి పూజలు నిలిచిపోయినవట. ఆ క్రమంలో అమ్మవారికి సమర్పించు పుట్టినింటి సారె కార్యక్రమం కూడా నిలిచిపోయినది. ఈ నేపథ్యంలో రెండేళ్లు క్రితం వేణుగోపాల స్వామి దేవస్థానం పునర్నిర్మాణం జరిగి ఆలయంలో నిత్య పూజలు జరుగుచున్నవి.గత సంవత్సరం గ్రామ పెద్దలు ఆలయ అర్చకులు ఆలయ కమిటీ చర్చించి ఈ కార్యక్రమాన్ని మరల మొదలుపెట్టారు. ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమానికి పలమనేరు వాసులు, శ్రీ వేణుగోపాల స్వామి భక్తులు, గంగమ్మ తల్లి భక్తులు అందరూ పాల్గొని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి కృపకు మరియు శ్రీ తిరుపతి గంగమ్మ, శ్రీ సత్య గంగమ్మ తల్లి కృపకు పాత్రులు కాగలరని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం వారు మంగళవారం తెలియజేశారు.

# డెంగ్యూ వ్యాధిని తరిమికొడదాం...



**రేణిగుంట, ఆంధ్రానాడు, మే 12:** ఈ నెల 16వ తేదీన జాతీయ డెంగ్యూ వ్యా ధి నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఈ వ్యాధి పట్ల అవగాహన క ల్పించేందుకు విస్తృతంగా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్న దని సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకట య్య మంగళవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం అనేది దోమల ద్వారా సంక్రమించే వ్యాధి అన్నారు. ఈ యొక్క వ్యాధి లక్షణాలు అధిక జ్వరం, దద్దర్లు, తలనొప్పి, కండరాలు కీళ్లు నొప్పులు కొన్ని తీవ్రమైన కేసులు రక్తస్రావం షాక్ కు దారితీస్తుందని గుర్తు చేశారు. ఉగాది దోమల ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఉగాది సంక్రమిస్తే నాలుగు నుండి ఆరు రోజుల నుండి ప్రారంభమవుతుందన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మూరికి నీళ్లు, నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వారంలో ఒకరోజు "ఫ్రైడే డ్రై డే "కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. డెంగ్యూ వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందాలని సూచించారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# పీలేరులో వడదెబ్బకు వృద్ధుడు మృతి



**పీలేరు – ఆంధ్రనాడు, మే 12 :** పీలేరు పట్టణంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. రైల్వే స్టేషన్ సమీపంలోని ఏటి నగర్ దిగువ ప్రాంతంలో సుమారు 85 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వృద్ధుడు వడదెబ్బకు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, ఆ వృద్ధుడిని ఎవరో అక్కడ వదిలి వెళ్లిపోయినట్లు అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. మండుతున్న ఎండలో చాలాసేపు సహాయం లేకుండా ఉండటంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. వృద్ధుడి పరిస్థితిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనను చూసిన ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులే భారంగా భావించి వృద్ధుడిని వదిలి వెళ్లి ఉండవచ్చనే అనుమానాలు వినిపిస్తున్నాయి. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ఇలాంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# శిక్షణా తరగతుల ముగింపు



**కురబలకోట – ఆంధ్రనాడు, మే 12:** సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోల్డన్ వ్యాలి విద్యాసంస్థల్లో నిర్వహించిన 7 రోజు ల శిక్షణా తరగతుల ము గింపు కార్యక్రమం ఘనం గా జరిగింది. ఈ సంద ర్భంగా ప్రాంత ప్రముఖ్ శ్రీ కొండారెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణతో పాటు మన ఆచార వ్యవ హారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత వారం రోజులుగా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని కార్యక్షేత్రంలో ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. ఎస్ఎస్ఎఫ్‌లో ధర్మప్రచార కులు, ధర్మవిస్తారకుల వ్యవస్థ నిర్మాణం చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ గుత్తా హరికృష్ణ, తుమ్మనగుంట అమరనాథ రెడ్డి, విభాగ్ కన్వీనర్లు శ్రీ రెడ్డప్ప రావు, శ్రీధర్ రాజు, శ్రీ సాయిరామ్, శ్రీ వెంగల్ రెడ్డి, శ్రీ జగన్నాథం, శ్రీ గంగాధర్, జిల్లా ధర్మప్రచారక్ శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ శ్రీ పూజారి వేణు, మహిళా కన్వీనర్ శ్రీమతి రమణమ్మ, శ్రీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో 59 మంది ధర్మప్రచారకులు, ధర్మవిస్తారకులు శిక్షణ పొందారు. గత వారం రోజులుగా క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమర లింగన్న, శ్రీ బ్రహ్మయ్య చౌదరి, రాష్ట్ర కమిటీ, జోనల్ కమిటీ, అన్నమయ్య కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**పలమనేరు, ఆంధ్రానాడు, మే 12:** పట్టణంలో మంగళవారం శ్రీ హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా బజారు వీధిలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం,భారీ ఎత్తున భక్తులకు,దారిన వెళ్లేవారికి ప్రసాద వినియోగాలలో భాగంగా పొంగలి, పెరుగు అన్నం, మజ్జిగ పాకెట్స్, వాటర్ ప్యాకెట్లు అందించి జై శ్రీ రామ్ అంటూ నినదించి సందడి చేశారు.

**అభయాంజనేయస్వామి దేవాలయం ప్రత్యేకత**

ఈ దేవాలయాన్ని 600 సంవత్సరాల పూర్వం శ్రీ కృష్ణ దేవరాయలు ఆస్థానంలో ముఖ్యులుగా వున్న వ్యాసరాయలు విజయనగరం నుంచి తిరుమల ఏడుకొండలు, కాశీయాత్రకు తమ పరివారంతో నడకదారిన బయలు దేరేవారు. అలా వారు దారిన వెళుతూ ఈ ఆలయం ఆవరణలో విడిదిచేసారు. ఇలా రెండు వారాల వరకూ ఇక్కడే బసచేసారని పురాణాలు చెబుతున్నాయి. ఈ సందర్భంలో వారితో వుండే శిల్పులు ఇక్కడి రాతి బండపై అభయాంజనేయ స్వామిని చెక్కి ప్రతిష్టించారు. వీరు చెక్కే అభయాంజనేయ స్వాముల చేతిలో సౌగంధికా పుష్పం, తోకలో గంట వుండేలా చెక్కేవారు. ఇలా బండపై చెక్కిన అభయాంజనేయ స్వామికి నేడు నిత్యం విశేష పూజలు అర్చకులు రామమూర్తి ద్వారా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ఆలయం రోడ్డుకు ఐదు అడుగుల క్రింద వుండడం విశేషం. అనగా 600సంవత్సరాలుగా రోడ్డు ఐదు అడుగుల ఎత్తు పెరిగిందన్న మాట.

**కోరిన కోర్కెలు తీర్చే అభయాంజనేయుడు**

ఈ ఆలయంలో మంగళ, శనివారం రోజులలో నిమ్మకాయలు దీపం పెడుతున్న భక్తుల కోర్కెలు తీరుతాయని విశ్వసిస్తున్నారు. పిల్లలు లేనివారు, భూత ప్రేత భయాలు వున్నవారు కూడా ఈ ఆలయం దర్శిస్తే అవి తొలగిపోతాయని ఓ నమ్మకం. శనివారం రోజులలోనూ విశేషంగా భక్తులు వస్తున్నారు. కాగా ఈ ఆలయంలో హనుమాన్ జయంతి నేపథ్యంలో తయ్యూరు కృష్ణయ్య శెట్టి ఆద్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన కుటుంబ సభ్యులు నరసింహ, నాగరాజుల కుటుంబ సభ్యులు పూజలు అభిషేకాలు నిర్వహించి ప్రసాద వితరణలు భారీగా చేసారు.

**మొరం వీరాంజనేయ స్వామి గుడిలో**

పలమనేరు రూరల్ మండలంలోని మొరం గ్రామం సమీపంలో వెలసిన 25 అడుగుల ఏకశిలా విగ్రహంతో రూపొందించిన వీరాంజనేయ స్వామి ఆలయంలో కూడా విశేష పూజలు అభిషేకాలు భారీగా నిర్వహించారు. ఇంకనూ పట్టణంలోని చిత్తూరు రోడ్డు ఆంజనేయ స్వామి దేవాలయం, బజారు వీధి మరి యు జవులి వీధిలో నెలకొన్న శ్రీ సీతారాముల, వీరాం జనేయ స్వామి గుడిలోనూ ఆలయ అర్చకులు నిర్వా హకులు విశేష పూజలు నిర్వహించగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకొని పునీతులయ్యారు.

# జలధార పనులపై కలెక్టర్ ఫోకస్

**- సాగునీటి వనరులు ఉద్యాన పంటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**



**పీలేరు – ఆంధ్రనాడు,మే 12:** అన్నమయ్య జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి, రైతాంగ సంక్షేమం, ఉద్యాన పంటల ప్రోత్సాహం లక్ష్యంగా చేపట్టిన జలధార–జలహారతి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పీలేరు నియోజకవర్గంలో ఇరిగేషన్, డ్వామా, ఉద్యానవన, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

**గొలుసుకట్టు చెరువులకు జలధార పనులు**

పీలేరు మండలం రేగల్లు పంచాయతీ కమ్మపల్లి వద్ద ఉన్న గొలుసుకట్టు చెరువులకు సంబంధించిన అమ్మ చెరువు బోడిగుట్ట నుంచి వచ్చే ఫీడర్ ఛానల్ ఉపాధి హామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ ఫీడర్ ఛానల్ ద్వారా దాదాపు ఆరు చెరువులు నిండే అవకాశం ఉందని అధికారులు వివరించారు. అలాగే బాలంవారిపల్లి పంచాయతీ గుర్రంవారిపల్లె వద్ద కొత్తనకుంట నుంచి సెట్టిగుంటకు వచ్చే ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించి, పనులు నాణ్యతతో నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

**అగ్రహారం చెరువుకు అభివృద్ధి చర్యలు**

అగ్రహారం గ్రామంలోని చెరువును పరిశీలించిన కలెక్టర్, చెరువు అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాల పెరుగుదలతో పాటు రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

**అడవిపల్లి రిజర్వాయర్ పరిశీలన**

తదుపరి కె.వి.పల్లి మండలంలోని అడవిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**మామిడి – టమాటా తోటల సందర్శన**

పీలేరు మండలం రేగల్లు గ్రామపంచాయతీ పరిధిలో రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలను కూడా కలెక్టర్ పరిశీలించారు. రైతు శ్రీకాంత్ రెడ్డి సాగు చేస్తున్న 15 ఎకరాల మామిడి తోటను సందర్శించి, పండ్ల రక్షణ కోసం ఏర్పాటు చేసిన కవర్లను పరిశీలించారు. దిగుబడి, మార్కెట్ ధరలు, సాగు పరిస్థితులపై రైతుతో చర్చించారు. ఇతర రైతులు కూడా ఈ విధానాన్ని అనుసరించేలా అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. అనంతరం రైతు కుమార్ నాయుడు సాగు చేస్తున్న టమాటా తోటను పరిశీలించి, చీడపీడల నివారణ, ఎరువుల వినియోగం, దిగుబడి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.

**ఆధునిక సాగు పద్ధతులు అవలంబించాలి**



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు డ్రిప్ ఇరిగేషన్, సేంద్రీయ ఎరువుల వినియోగం, నీటి పొదుపు పద్ధతులు వంటి ఆధునిక సాగు విధానాలను అనుసరించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, పంటల బీమా, ఉద్యాన అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకొని అధిక ఆదాయం పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ విటల్ ప్రసా ద్, రిటైర్డ్ ఎస్ఈ వెంకటరామయ్య, డ్వామా పీడీ వెంకటరత్నం, ఉద్యానవన శాఖ అధికారి సుభాషిణి, డీపీఓ రాధమ్మతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర ఆసుపత్రిలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవలు ప్రారంభం

## - అత్యవసర గుండె జబ్బులకు ఉచిత చికిత్స

## - కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్. బాలకిషోర్



**మదనపల్లి – ఆంధ్రనాడు,మే 12:** అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఆసుపత్రిలో అత్యవసర గుండె జబ్బుల చికిత్స కోసం డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్. బాలకిషోర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గుండెపోటు, తీవ్రమైన ఛాతీ నొప్పి, హైబీపీ వంటి అత్యవసర పరిస్థితుల్లో ఇకపై రోగులను తిరుపతి, బెంగళూరుకు తరలించాల్సిన అవసరం లేకుండా మదనపల్లి లో నిమిషాల వ్యవధిలో ప్రాణరక్షక వైద్యం అందుతుందని చెప్పారు. గుండెపోటు వచ్చిన తర్వాత తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పేర్కొంటారని, ఆ సమయంలో చికిత్స అందితే 80 శాతం మంది రోగులను కాపాడే అవకాశం ఉంటుందని వివరించారు. ఇప్పటి వరకు మదనపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు చికిత్స కోసం 2 నుంచి 3 గంటల పాటు ప్రయాణించి తిరుపతి చేరుకునేలోపు పరిస్థితి విషమించేదని, ఇప్పుడు ఆ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్, పేస్‌మేకర్ వంటి సేవలు పూర్తిగా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవల కింద 24 గంటల అత్యవసర కార్డియాక్ విభాగం, గుండెపోటు, తీవ్రమైన బీపీ కేసులకు తక్షణ వైద్యం, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, క్యాథ్‌ల్యాబ్ సౌకర్యం, ఐసీయూ, కార్డియాక్ మానిటరింగ్‌తో పాటు 24 గంటల స్పెషలిస్ట్ పర్యవేక్షణ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు, ఈహెచ్ఎస్ కార్డు కలిగి వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉన్న కుటుంబాలకు ఈ సేవలు వర్తిస్తాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో నేరుగా ఆసుపత్రికి రావచ్చని, ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం 8125001531 నంబర్‌ను సంప్రదించాలని డాక్టర్ ఎస్. బాలకిషోర్ తెలిపారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**- స్వామివారిని దర్శించుకున్న ఏంఎల్ఏ నవీన్ యాదవ్**

**- భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ**

**- హనుమంతుల వారి ఊరేగింపు**







**హైదరాబాద్– ఆంధ్రనాడు,మే 12:** నగరంలోని జూబ్లీహిల్స్ పరిధి మధురానగర్ లో వెలసిన అభయఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. వేకువజమున మొదలుకొని సాయంత్రం వరకు ఆలయ అర్చకులు పలురకాల పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష నాగవల్లి దళార్చన నిర్వహించి, హనుమంతల వారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు సుందరముగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. స్థానిక ఏంఎల్ఏ నవీన్ యాదవ్ కుటుంబ సమేతంగా విచ్చేసి అభయ ఆంజనేయ స్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ వ్యవస్థాపకలు నవీన్ యాదవ్ కు పూర్ణకుంభ స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో వేలాది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్ర సమయంలో హనుమంతుల వారి ఉత్సవ విగ్రహానికి అలంకరించి మధురానగర్, వెంగళరావు నగర్ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు తోటకూర నరసింహారావు దంపతలు, తోటకూర వెంకటరమణ దంపతలు, ప్రధాన అర్చకులు పవనకుమార్, సత్యం స్వామి, రఘు స్వామి, వీరేష్ శర్మ, మహేష్ శర్మ, మేనేజర్లు సూర్యారావు, రాజు, వాలంటీర్లు, భక్తులు పాల్గొన్నారు.



**రామకుప్పం మండలంలో....** శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా పలు దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు మిట్టపల్లి , పిల్లిగుట్లలు, రాజుపేట విజిలాపురం ఇంకా పలు గ్రామాలలో శ్రీరామ భక్త ఆంజనేయ స్వామికి ఉదయమే అభిషేక పూజలు హోమాలు నిర్వహించారు రాజపేట గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలను భాగంగా కోలాటాలు ప్రదర్శన కూడా నిర్వహించారు అనంతరం అన్న సంతర్పణ చేపట్టారు పలు దేవాలయాల్లో స్వామివారికి విశేష అలంకరణ విద్యుత్ దీప లతో చేశారు హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా గ్రామస్తులు దేవాలయ కమిటీ వారు నిర్వహించారు.



**పీలేరు ఆంజనేయస్వామి ఆలయంలో....** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పీలేరు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నాగభూషణం ఆధ్వర్యంలో ఉదయాన్నే ఆంజనేయస్వామికి రాజు స్వామి, కిరణ్ స్వామిలు మంగళస్నానం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేడుకలకు విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాగభూషణం, దినకర్, రమేష్, యోగానంద రెడ్డి, జగన్మోహన్, తులసి కృష్ణ, సుదర్శన్ రెడ్డి, కృపాల్, ఆదినారాయణ, సురేష్, నాగరాజా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



**తిరుమలలో ...** హనుమజ్జయంతి సందర్భంగా తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని 7వ మైలు వద్ద ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహం వద్ద వేద మంత్రోచ్చారణలు మేళతాళాల నడుమ టీటీడీ ప్రత్యేక పూజలను వేడుకగా నిర్వహించింది. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో అదనపు ఈఓ సి. హెచ్. వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈఓ లోకనాథం, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలలో స్థానికంగా ఉన్న పలు హనుమాన్ ఆలయాల్లో కూడా హనుమజ్జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.



**తిరుమల జాపాలి హనుమాన్‌కు ...** హనుమజ్జయంతి సందర్భంగా తిరుమల లోని జాపాలి శ్రీ ఆంజనేయ స్వామి వారికి టీటీడీ తరపున ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరితో కలిసి మంగళవారం ఉదయం పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు సింధూర వస్త్రంతో ఈవో, అదనపు ఈవోలను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ హనుమజ్జయంతి రోజున జాపాలి హనుమాన్ కు టీటీడీ తరుపున పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆహ్లాదకరమైన వాతావర ణంలో తిరుమలలో హనుమజ్జయంతి వేడుకలు జరుగుతున్నాయని, భక్తులంద రూ సంతోషంగా దర్శనాలు చేసుకుంటున్నా రని చెప్పారు. భక్తులందరికీ హనుమంతుని అనుగ్రహం కలగాలని ప్రార్థించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు టీటీడీ ఈఓ అదనపు ఈఓ లు తిరుమల శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీ బేడీ ఆంజనేయ స్వామి వారి మూలమూర్తికి జరిగిన ప్రత్యేక అభిషేకంలో కూడా పాల్గొన్నారు.

**తిరుమలలో వైకుంఠం కాంప్లెక్స్ వైనుక వైపు ఉన్న ...** పగడ హనుమాన్ ఆలయం నందు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి అభిషేకం, పూజలు నిర్వహించి, విచ్చేసిన యాత్రికులు, స్థానికులకు నైవేద్యం ప్రసాదాలు పంచి మధ్యాహ్నం అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో బెల్లం రమేష్ మిత్ర బృందం పాల్గొన్నారు.





## పరుగులు పెడుతున్న అమరావతి

**విజయవాడ–ఆంధ్రనాడు,మే 12:** అమరావతి రాజధాని నిర్మాణ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. 2028 నాటికి తొలి దశ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉంది ప్రభుత్వం. ఒక రూపం తీసుకువచ్చి ఎన్నికలకు వెళ్లాలన్నది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ఓటమి వచ్చిన తర్వాత అమరావతి పునర్నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. అమరావతిని ప్రపంచ నగరాల్లో ఒకటిగా నిలపాలన్నది చంద్రబాబు ఆలోచన. ఆ వ్యూహానికి తగ్గట్టు పనులు జరుగుతున్నాయి. అయితే ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలోనే అమరావతిపై చర్చ జరిగేది. కానీ ఇప్పుడు జాతీయ స్థాయిలో సైతం అమరావతిపై చర్చ జరుగుతోంది. దేశంలోని ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, జర్నలిస్టులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో జాతీయస్థాయిలో విస్తృత ప్రచారం జరుగుతోంది అమరావతి నిర్మాణంలో సాంకేతిక అంశాలను జోడిస్తోంది ప్రభుత్వం. ప్రధానంగా గ్రిడ్ తరహా డిజైన్, కృష్ణానది తీరాన అభివృద్ధి చెందుతున్న జోనల్ సిస్టం ఇప్పుడు ప్రచారంలోకి వస్తోంది. ప్రముఖ యూట్యూబర్ రాజన్ సింగ్ అమరావతి పనులపై రూపొందించిన వీడియో విపరీతంగా వైరల్ అవుతోంది. దేశ ప్రజలను ఆకర్షిస్తోంది. కేవలం సంక్షేమ పథకాలు కాదు.. శాశ్వతమైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాధాన్యతను అమరావతి నిరూపిస్తోందని ఈ వీడియో చూసిన వారు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు ఏపీలో సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే.. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీగా అమరావతిని రూపుదిద్దుతున్నారు. ఇప్పటికే ప్రతిష్టాత్మక యూనివర్సిటీలు, ప్రపంచ స్థాయి విద్యాసంస్థల క్యాంపస్లు అమరావతిలో నెలకొల్పుతున్నారు. ఇదే విషయాన్ని చెబుతున్నారు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు. ప్రస్తుతం ఎండలకు తీవ్రత అధికంగా ఉంది. అమరావతి చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే ఈ ఎండల్లో సైతం అమరావతి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు ఎండలను కూడా లెక్క చేయకుండా జాతీయస్థాయి ఇన్ఫ్లుయెన్సర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి.. అక్కడ జరుగుతున్న అద్భుతమైన మౌలిక వసతుల కల్పనను రికార్డ్ చేస్తున్నారు. అత్యాధునిక రవాణా సౌకర్యాలు, విశాలమైన రహదారులు, పక్కాగా విభజించిన నివాస, వాణిజ్య జోన్లను చూసి ఇండియాలోనే అద్భుత నగరం అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. రాబోయే తరాలకు ఒక ఆదర్శప్రాయమైన మాడల్ అవుతుందని ఎక్కువమంది కామెంట్స్ చేస్తున్నారు. జాతీయ మీడియాలో సైతం ప్రత్యేక కథనాలు వస్తున్నాయి. తద్వారా అమరావతిలో పెట్టుబడులు పెడుతున్న ప్రైవేటు సంస్థలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

## ఈ వారం వానలే..
## గుడ్ న్యూస్ చెప్పిన వెదర్ మ్యాన్

**విశాఖపట్టణం–ఆంధ్రనాడు,మే 12:**

ఏపీ ప్రజలకు బిగ్ రిలీఫ్.. రాష్ట్రంలో మరో వారం రోజుల్లో వర్షాలు కురవనున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మరో వారం రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. మరోవైపు రోజున పలు జిల్లాలలో పిడుగులతో కూడిన తేలికపాటి వానలు పడతాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వారం రోజులలో వర్షాలు కురవనున్నట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. వారం రోజుల్లో తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని శ్రీలంక పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతోందన్న విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు.. ఈ అల్పపీడనం మరికొన్ని గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనానికి అనుబంధంగా.. 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దీంతో వారం రోజుల్లో ఏపీలో వర్షాలు కురిసే అవకాశంఉందన్నారు. గడిచిన 24 గంటల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అత్యధికంగా 3.24 సెం.మీ వర్షం కురిసినట్లు వెల్లడించారు. మరోవైపు ఉత్తర శ్రీలంక తీరము, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా , పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు ,కృష్ణా జిల్లా, ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. మరోవైపు అల్లూరి జిల్లా జికే వీధి, ముంచింగిపుట్టు, పెదబయలు మండలాలతో పాటుగా పోలవరం జిల్లా చింతూరు, కూనవరం, మారేడుమిల్లి, వరరామచంద్రాపురం, గుర్తేడు మండలాల్లో మంగళవారం రోజున వడగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని వెల్లడించింది. విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. బహిరంగ ప్రదేశాల్లో ఉండొద్దని సూచించింది. రైతులు, కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

# ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తా....

- ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలి...
- వేశాలమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడి




**తిరుపతి –ఆంధ్రనాడు, మే 12 :** తిరుపతిలోని వేశాలమ్మ, తాళ్లపాక పెద్ద గంగమ్మ, అంకాలమ్మ, ఇతర ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. మంగళవారం వేశాలమ్మ అమ్మవారిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దర్శించుకున్నారు. అంతకుముందు ఆయన ఆలయం వద్దకు రాగానే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో రాష్ట్ర నేతలు సురా సుధాకర్ రెడ్డి, పుష్పావతి యాదవ్, బుల్లెట్ రమణ, కృష్ణ యాదవ్ ఆలయ చైర్మన్ కామాటం జగదీష్ రెడ్డి పాలకమండలి సభ్యులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను చైర్మన్ జగదీష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని టిడిపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం నేతృత్వంలో నాయకులు శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అంకాలమ్మ అమ్మవారిని బొజ్జల సుధీర్ రెడ్డి దర్శించుకున్నారు. అక్కడ ఆలయ పాలకమండలి చైర్మన్ తో పాటు సభ్యులు ఘనస్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గం ప్రజలందరికీ గంగమ్మ జాతర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి రైతులకు పంటలు చేతికందే విధంగా అమ్మ ఆశీస్సులు ఉండాలని కోరారు. ఇక ప్రతి ఏటా తిరుపతి నగరంలోని గ్రామదేవతలను దర్శించుకోవడానికి వస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మేడి కుర్తీ విశ్వనాథం, రాజారాం పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.


## స్విమ్స్ లో ఘనంగా "అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం"

### -రోగుల సేవలో నర్సుల పాత్ర వెలకట్టలేనిది




**తిరుపతి –ఆంధ్రనాడు, మే 12:** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రిలో మంగళవారశీ శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు 116వ అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారని మెడికల్ సూపరింటిండెంట్ డా.రామ్ తెలియజేశారు.స్విమ్స్ డీన్ డా. అలోక్ సచన్, తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు , తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, ఫార్మకాలజీ విభాగాధిపతి డా.ఉమామహేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.శివశంకర్, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ సునీత, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ 1- ఇందిరమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 శారదా దేవి, భువనేశ్వరి, నిర్మల జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.స్విమ్స్ డీన్ అలోక్ సచన్ మాట్లాడుతూ స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డాక్టర్ ఆర్.వి.కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వైద్య రంగంలో నర్సింగ్ వృత్తి మహోన్నతమైనదని, నర్సింగ్ వృత్తి దైవత్వంతో కూడుకున్నదని, ఫ్లోరెన్స్ నైటింగేల్ స్వచ్ఛంద సేవకురాలిగా సమాజానికి నర్సింగ్ సేవలందించి వృత్తికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిపెట్టారని పేర్కొన్నారు.నర్సింగ్ సూపరింటెండెంట్ డా. సునీత మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం రోగులకు ఆమె అందించిన అమూల్యమైన నర్సింగ్ సేవలకు గుర్తింపుగా అంతర్జాతీయ నర్సింగ్ కౌన్సిల్ వారు నర్సింగ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. శివశంకర్, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డా.సుధారాణి, ఫార్మకాలజీ విభాగాధిపతి డా. ఉమామహేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ లు తదితరులు ప్రసంగించారు.స్విమ్స్ డీన్ డా అలోక్ సచన్ వృత్తి నిర్వహణలో ప్రతిభ కనపరచిన నర్సులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్. యం. ఓ. డాక్టర్. సతీష్, స్విమ్స్ నర్సింగ్ అసోసియేషన్ సభ్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్లు, నర్సింగ్ సిబ్బంది. ఇతర విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.1.03 కోట్లు విరాళం



**తిరుమల –ఆంధ్రనాడు, మే 12** :ముంబైకు చెందిన విజయ్ రమేష్ చంద్ర అనే భక్తుడు మంగళవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.1.03 కోట్లు విరాళంగా అందించారు.ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.




Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733